(సమగ్ర తెలుగు డిజిటల్ దినపత్రిక)

# ప్రజావేదిక

PRAJA VEDIKA TELUGU DAILY





తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 4 సంచిక : 227 (కాంప్లిమెంటరీ కాపీ) ఎడిటర్:వెంకన్న 27-05 - 2026 పేజీలు : 6 Digital Edition



# గామ పంచాయతీ సిబ్బందికి ఒకటో తారీఖునే జీతాలు

- ఆదాయం బ్యాంకు ఖాతాలో వేసుకోవచ్చు
- ఖజానాలో వేసి తీసుకొనే పద్ధతి ఎత్తేయండి
- ఆ మేరకు పంచాయతీరాజ్ చట్ట సవరణ
- పంచాయతీల్లో సిబ్బందికి ఒకటినే వేతనం
- వాటిల్లో పనిచేసే 50 వేల మందికి ఊరట
- ప్రభుత్వ ఖజానా నుంచి నెలనెలా రూ.50 కోట్లు
- పెన్షనర్ల సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి
- పోస్టాఫీసు ద్వారా చెల్లింపుల పద్ధతి నిలిపివేత
- కొత్త పెన్షన్లలో ఒంటరి మహిళకు తొలి ప్రాధాన్యం
- పంచాయతీరాజ్ సమీక్షలో రేవంత్ నిర్ణయాలు

హైదరాబాద్:
రాష్ట్రంలోని 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతీ నెలా మొదటి తారీఖునే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై మంత్రి సీతక్కతో కలిసి సమీక్ష? నిర్వహించారు. 2లో



# అక్రమ వలసలకు చెక్

- అసహజ జనాభా మార్పులపై ఉన్నత స్థాయి కమిటీ
- సుప్రీం విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ఏర్పాటు
- ప్రకటించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ, మే 26: దేశంలోకి నానాటికీ పెరుగుతున్న అక్రమ వలసలకు చెక్ పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. అక్రమ వలసలు, చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాలతో దేశంలో జరుగుతున్న అసహజ జనాభా మార్పులపై అధ్యయనానికి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం ప్రకటించారు. 2లో

## కశ్మీర్ ప్రస్తావన తీసుకువచ్చిన పాక్-చైనా... భారత్ కౌంటర్



- చైనా-పాక్ ఉమ్మడి ప్రకటనపై భారత్ తీవ్ర అభ్యంతరం
- ప్రకటనలో కశ్మీర్ ప్రస్తావనను ఖండించిన విదేశాంగ శాఖ
- సీపీఈసీ ప్రాజెక్టులపై మరోసారి వ్యతిరేకతను తెలిపిన భారత్

జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టీకరణ
చైనా-పాక్ మధ్య జలాల సహకారం ప్రస్తావనను తోసిపుచ్చిన భారత్
చైనా, పాకిస్థాన్ దేశాలు విడుదల చేసిన ఉమ్మడి ప్రకటనలో జమ్మూకశ్మీర్‌పై చేసిన అనవసర ప్రస్తావనలను భారత్ తీవ్రంగా ఖండించింది.



# శంషాబాద్‌లో రూ.వెయ్యి కోట్ల భూ కుంభకోణం

హైదరాబాద్:
రైతుల ధాన్యం కొనుగోలు చేతగాదు, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం చేతగాదు గానీ, ప్రభుత్వ భూములను అందిన కాడికి కాంగ్రెస్ నాయకులు కొల్లగొడుతున్నారని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. శంషాబాద్‌లో రూ.వెయ్యి కోట్ల భూ కుంభకోణాన్ని ధారాలతో సహా బయట పెడుతున్నామని అన్నారు. దీనిపై సిట్ లేదా సీఐడీ విచారణ జరిపి ప్రభుత్వ భూములను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 2లో

# డ్రైవర్‌పై వేటు వెనక్కి..



## విధుల్లో కొనసాగించాలని మంత్రి పొన్నం ఆదేశం

- డ్రైవర్ అశోక్‌ను తొలగించాలన్న నిర్ణయాన్ని మార్చుకోవాలని మంత్రి పొన్నం సూచన
- రైతుల పక్షాన మాట్లాడటాన్ని స్వాగతిస్తున్నామన్న రవాణా శాఖ మంత్రి
- పెట్రోల్ ధరలపై నిరసన కన్నా, ధాన్యం కొనాలని కాంగ్రెస్ నేతలకు డ్రైవర్ సలహా
- డ్రైవర్‌ను తొలగించడంపై బీఆర్ఎస్, ఇతర విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు
- ఫిర్యాదుతో డ్రైవర్‌ను విధుల నుంచి తప్పించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ లేఖ 2లో




# రూ.50 వేల కోట్ల డీల్ వెనుక..?

న్యూఢిల్లీ :అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో నాలుగు రోజుల భారత పర్యటన మంగళవారం ముగిసింది. రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో ఐదు వందల బిలియన్ డాలర్ల విలువైన అమెరికా వస్తువులను భారత్ కొనుగోలు చేస్తుందంటూ ఆయన ఆదివారం సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. 2లో



# తెలంగాణ గవర్నర్ ను కలిసిన కవిత... రేవంత్ సర్కారుపై ఫిర్యాదు

- భూసేకరణ బాధితుల సమస్యలపై గవర్నర్‌ను కలిసిన కవిత
- ఖమ్మం, పరిగి, ఆర్ఆర్ఆర్ బాధితుల సమస్యలను వివరించిన కవిత
- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు
- బాధితులకు న్యాయం జరగకపోతే మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరిక

రాష్ట్ర ప్రభుత్వ భూసేకరణ కారణంగా నిరాశ్రయులైన బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కె. కవిత గవర్నర్‌ను కోరారు. మంగళవారం ఆమె ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, పలువురు బాధితులతో కలిసి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఒక వినతిపత్రం సమర్పించారు.

ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్లు కూల్చివేతకు గురైన బాధితులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని, పరిగి మండలం కడ్లాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం జారీ చేసిన భూసేకరణ నోటీసును రద్దు చేయాలని వారు గవర్నర్‌ను కోరారు. 2లో

## గ్రామ పంచాయతీ సిబ్బందికి ఒకటో తారీఖునే జీతాలు

హైదరాబాద్:

రాష్ట్రంలోని 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతీ నెలా మొదటి తారీఖునే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై మంత్రి సీతక్కతో కలిసి సమీక్ష? నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఐఏఎస్ అధికారులకు నెల నెలా సమయానికి జీతాలు అందినట్లే గ్రామ పంచాయతీ సిబ్బందికి కూడా జీతాలు అందాలన్నారు. సిబ్బంది జీతాలు చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతీ నెలా రూ.50 కోట్లు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ అనే తేడా లేకుండా ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని ఉద్యోగులకు మొదటి తారీఖునే జీతాలు అందేలా చూడాలన్నారు. స్వంత ఆదాయంపై గ్రామపంచాయతీల స్వతంత్రతను నిర్వీర్యం చేస్తూ గత ప్రభుత్వం తొలగించిన నిబంధనను పునరుద్ధరించేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018 లోని సెక్షన్ 70(3) ప్రతిపాదిత సవరణ ప్రకారం గ్రామ పంచాయతీ స్వంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో కాకుండా బ్యాంకు ఖాతాలో జమ చేసే విధంగా సవరణ చేయాలని ఆదేశించారు. పోస్టల్ శాఖ ద్వారా అందజేస్తున్న ఆసరా పింఛన్ల ప్రస్తుత విధానాన్ని మార్చి నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమచేయాలని సీఎం ఆదేశించారు. అర్హులకే పింఛన్లు అందేలా ఓటర్ ఐడీ, ఆధార్, సీపెక్ డేటా ఆధారంగా స్ట్రీమ్ లైన్ చేయాలని సూచించారు. కొత్తగా అందించే పింఛన్లలో ఒంటరి మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమీక్ష?లో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయతీరాజ్ ప్రతేక కార్యదర్శి దానకిషోర్, కమిషనర్ డి.దివ్య దేవరాజన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో రూ.వెయ్యి కోట్ల భూ కుంభకోణం

హైదరాబాద్:

రైతుల ధాన్యం కొనుగోలు చేతగాదు, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం చేతగాదు గానీ, ప్రభుత్వ భూములను అందిన కాడికి కాంగ్రెస్ నాయకులు కొల్లగొడుతున్నారని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. శంషాబాద్‌లో రూ.వెయ్యి కోట్ల భూ కుంభకోణాన్ని ధారాలతో సహా బయట పెడుతున్నామని అన్నారు. దీనిపై సిట్ లేదా సీఐడీ విచారణ జరిపి ప్రభుత్వ భూములను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇందులో భాగస్వాములైన పెద్దలెవరో తేల్చాలనీ, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ లో173 నుంచి 183 మధ్య ఉన్న భూమిలో 170 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రయివేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే కుట్ర జరిగిందని చెప్పారు.

అది ప్రభుత్వ భూమి అని, దాన్ని ఆక్రమణకు గురి కాకుండా ఉండాలని తహశీల్దార్ ను ఆర్డీవో ఆదేశించారని గుర్తు చేశారు. ప్రొహిబిషన్ జాబితా 22ఏలో పెట్టాలన్నారని చెప్పారు. ఈ ఏడాది జనవరి 30న హైకోర్టుకు ఇచ్చిన అఫిడవిట్ లో పొందుపర్చారని అన్నారు. ఇది ప్రభుత్వ భూమి అని ఫ్రిబవరి 24న తహశీల్దార్ తేల్చారని వివరించారు. నాలుగు రోజుల తర్వాత ఫిబ్రవరి 28న ఈ భూమి ప్రయివేటు వ్యక్తులకు చెందుతుందని తహశీల్దార్ ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. నాలుగు రోజుల్లోనే ప్రభుత్వ భూమి ప్రయివేటు భూమి ఎలా అయ్యిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఈ భూమిని భూ భారతి ఆన్ లైన్ లో కూడా పెట్టాలన్నారని చెప్పారు.ఆర్డీవో, తహశీల్దార్ రెండు భిన్నమైన నివేదికలు ఇస్తే జీపీ రెవెన్యూ హైకోర్టుకు ఎలా ఇచ్చారని అడిగారు. ఏ ఆదేశాలైనా కలెక్టర్ ఆమోదంతో హైకోర్టుకు వెళ్తుందనీ, కలెక్టర్ ఎలా ఆమోదించారని ప్రశ్నించారు. దీన్ని అడ్వకేట్ జనరల్ (ఏజీ) ఏ రకంగా ఆమోదించారని అన్నారు. రూ.వెయ్యి కోట్ల విలువైన భూములకు సంబంధించి ఇంత పెద్ద కుంభకోణం జరిగితే అధికారులపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ స్కాం గురించి మీడియాలో వస్తే ఈ కేసులో కేవలం తహశీల్దార్‌ను కలెక్టరేట్ కు బదిలీ చేసి ఊరుకున్నారని చెప్పారు. ఏసీబీ అధికారులు తనిఖీలకు వెళ్లారనీ, ప్రభుత్వ పెద్దలు ఏం చెప్పారో ఏసీబీ వారు వెనక్కి వచ్చారని వివరించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అత్యంత సన్నిహితుడు ఇందులో ఉన్నాడు కాబట్టే ఏసీబీ వెనక్కి వచ్చిందని ఆరోపించారు. ఒత్తిడి కారణంగానే తహశీల్దార్ కేవలం బదిలీ అయ్యారని చెప్పారు. ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.తహశీల్దార్‌ను కాపాడటంలో ఉన్న పెద్దలెవరు? వారు బయటకు రావాలని డిమాండ్ చేశారు. భూ భారతిలో భూమి చేరాలంటే దరఖాస్తు పెట్టాలనీ, ఆర్డీవో దాన్ని ఆమోదించాలని చట్టంలో ఉందన్నారు. కానీ తహశీల్దార్ భూ భారతిలో పెట్టాలని చెప్పగానే అది నమోదైందని వివరించారు. 170 ఎకరాలు ప్రభుత్వ పట్టా భూమిని ఎలా ఎక్కించారని ప్రశ్నించారు.ఈ భూమిని ఎందుకు వెనక్కి తీసుకోరనీ, ఎందుకు నిషేధిత జాబితాలో పెట్టరని అడిగారు. తహశీల్దార్ ఆదేశాలను సస్పెండ్ చేయాలనీ, ఆ అధికారిని సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఆర్డర్ మీద అప్పీల్‌కు వెళ్లాలనీ, ఆ భూమిని తిరిగి నిషేధిత జాబితో పెట్టాలని కోరారు. జగిత్యాలలో ఆర్టీసీ డ్రైవర్ పై సస్పెన్షన్ వేటు వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. డ్రైవర్ అశోక్ ధాన్యం కొనుగోలు చేయాలని మాట్లాడితే తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో మాట్లాడే స్వేచ్ఛ ఉంటుందన్నారు. ఆయన సస్పెన్షన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ డ్రైవర్ అశోక్ కు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. దీనిపై న్యాయపోరాటం, ప్రత్యక్ష పోరాటానికి పూనుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రులు పి సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు ఎల్ రమణ, దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హఠావో -సింగరేణి బచావో : హరీశ్‌రావు

కాంగ్రెస్ హఠావో -- సింగరేణి బచావో అనేది బొగ్గు గని కార్మికుల నినాదం కావాలని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితి ఇట్లనే ఉంటే సింగరేణి లో జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉంటుందన్నారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి స్కాం లకు గనిలా మారిందని చెప్పారు. నైనీ బ్లాక్ బొగ్గు గనుల టెండర్ అంశం కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి ని బయట పెట్టిందని అన్నారు. త్వరలో సింగరేణి కి సంబం ధించి కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు మరిన్ని బయట పెడతామని చెప్పారు.

?సింగరేణి ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ : కొప్పుల ఈశ్వర్

సింగరేణి ఎన్నికల్లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ సంఘం గౌరవాధ్యక్ష?్షలు, మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఏ కార్మిక సంఘంతో పొత్తు ఉండబోదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష? సిరికొండ మధుసూదనాచారి, టీబీజీకేఎస్ అధ్యక్ష?్షలు రాజిరెడ్డి, సింగరేణి ప్రాంత బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్‌పై వేటు వెనక్కి..
## విధుల్లో కొనసాగించాలని మంత్రి పొన్నం ఆదేశం

డ్రైవర్ అశోక్‌ను తొలగించాలన్న నిర్ణయాన్ని మార్చుకోవాలని మంత్రి పొన్నం సూచన

రైతుల పక్షాన మాట్లాడటాన్ని స్వాగతిస్తున్నామన్న రవాణా శాఖ మంత్రి

పెట్రోల్ ధరలపై నిరసన కన్నా, ధాన్యం కొనాలని కాంగ్రెస్ నేతలకు డ్రైవర్ సలహా

డ్రైవర్‌ను తొలగించడంపై బీఆర్ఎస్, ఇతర విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు

ఫిర్యాదుతో డ్రైవర్‌ను విధుల నుంచి తప్పించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ లేఖ

కాంగ్రెస్ నేతల నిరసనపై విమర్శలు చేశాడన్న ఆరోపణలతో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌ను తొలగించడంపై చెలరేగిన వివాదానికి తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెరదించారు. డ్రైవర్ అశోక్‌పై తీసుకున్న చర్యను వెనక్కి తీసుకోవాలని, అతడిని విధుల్లో కొనసాగించాలని యాజమాన్యానికి సూచించినట్టు ఆయన మంగళవారం తెలిపారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. "డ్రైవర్ అశోక్ ఆర్టీసీ ఉద్యోగి కాదు, కేవలం అద్దె బస్సు డ్రైవర్ మాత్రమే. అయినప్పటికీ, అతను రైతుల పక్షాన మాట్లాడాడు. దానిని మేము స్వాగతిస్తున్నాం. అందుకే అతడిని ఉద్యోగం నుంచి తొలగించవద్దని బస్సు యాజమాన్యానికి సూచించాం" అని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటోందని, ఈ విషయాన్ని విపక్షాలు రాజకీయం చేయవద్దని హితవు పలికారు.

అసలేం జరిగిందంటే..

సోమవారం జగిత్యాల నుంచి ధర్మపురికి బస్సు నడుపుతున్న సమయంలో, పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ కాంగ్రెస్ నేతలు, మంత్రి ఆడ్లూరి లక్ష్మణ్ చేపట్టిన ధర్నాపై డ్రైవర్ అశోక్ స్పందించారు. నిరసనల కన్నా రైతుల నుంచి మొక్కజొన్న, పత్తి వంటి పంటలను కొనుగోలు చేయడంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించినట్టు తెలిసింది.

ఈ వ్యాఖ్యలపై స్థానిక కాంగ్రెస్ నేత ఒకరు ఫిర్యాదు చేయడంతో, డ్రైవర్‌ను తక్షణమే విధుల నుంచి తప్పించాలని బస్సు యజమానికి జగిత్యాల డిపో మేనేజర్ లేఖ రాశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ నేతలు హరీశ్ రావు, కవిత తీవ్రంగా స్పందించారు. ప్రశ్నించిన వారి ఉద్యోగాలు తీసేయడం అప్రజాస్వామికమని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు గంగుల కమలాకర్, జీవన్ రెడ్డి.. ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌ను కలిసి అశోక్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది.

# తెలంగాణ గవర్నర్ ను కలిసిన కవిత... రేవంత్ సర్కారుపై ఫిర్యాదు

భూసేకరణ బాధితుల సమస్యలపై గవర్నర్‌ను కలిసిన కవిత

ఖమ్మం, పరిగి, ఆర్ఆర్ఆర్ బాధితుల సమస్యలను వివరించిన కవిత

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు

బాధితులకు న్యాయం జరగకపోతే మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరిక



రాష్ట్ర ప్రభుత్వ భూసేకరణ కారణంగా నిరాశ్రయులైన బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కె. కవిత గవర్నర్‌ను కోరారు. మంగళవారం ఆమె ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, పలువురు బాధితులతో కలిసి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఒక వినతిపత్రం సమర్పించారు.

ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్లు కూల్చివేతకు గురైన బాధితులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని, పరిగి మండలం కడ్లాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం జారీ చేసిన భూసేకరణ నోటీసును రద్దు చేయాలని వారు గవర్నర్‌ను కోరారు. అలాగే, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ మార్పు, ఇతర భూసేకరణ సమస్యలను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

గవర్నర్‌తో భేటీ అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహిళల ఇళ్లను కూల్చివేస్తున్నారని, రేవంత్ రెడ్డి ఒక నిర్దయుడైన ముఖ్యమంత్రి అని, కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గమైన పాలన అందిస్తోందని ఆమె విమర్శించారు. వంద రూపాయల చీరలు పంచి బాధితులను లక్షాధికారులను చేశానని సీఎం అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు.

తమ పోరాటాల ఫలితంగా వెలుగుమట్ల బాధితులకు అదే స్థలంలో భూమి కేటాయించడానికి ప్రభుత్వం అంగీకరించిందని, పరిగి, ఆర్ఆర్ఆర్ భూసేకరణ ప్రక్రియలను నిలిపివేసిందని కవిత తెలిపారు. ఇవి పాక్షిక విజయాలని, సంపూర్ణ న్యాయం కోసం కేంద్రం ప్రమేయం అవసరమని, అందుకే గవర్నర్‌ను కలిశామన్నారు. గవర్నర్ సానుకూలంగా స్పందించారని, అన్ని అంశాలపై నివేదిక తెప్పించుకుని న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. బాధితులకు న్యాయం జరగని పక్షంలో మరోసారి ఉద్యమబాట పడతామని ఆమె హెచ్చరించారు

## రూ.50 వేల కోట్ల డీల్ వెనుక..?

న్యూఢిల్లీ :అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో నాలుగు రోజుల భారత పర్యటన మంగళవారం ముగిసింది. రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో ఐదు వందల బిలియన్ డాలర్ల విలువైన అమెరికా వస్తువులను భారత్ కొనుగోలు చేస్తుందంటూ ఆయన ఆదివారం సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. 'భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గార్, దౌత్యవేత్తలు చేసిన కృషికి ధన్యవాదాలు. వారి కృషి కారణంగానే ఇంధనం, సాంకేతికత, వ్యవసాయ రంగాలలో రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో ఐదు వందల బిలియన్ డాలర్ల విలువైన అమెరికా వస్తువులను కొనుగోలు చేయడానికి భారత్ నిబద్ధత చూపింది' అని ఆయన అందులో రాసుకొచ్చారు.సుప్రీం తీర్పుతో కూలిపోయిన వాణిజ్య ఒప్పందం పునాది

భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. వీటిపై ఫిబ్రవరి 6న సంయుక్త ప్రకటన వెలువడింది. అందులోనే ఐదు వందల బిలియన్ డాలర్ల అమెరికా వస్తువులను కొనుగోలు చేస్తానని భారత్ తెలిపింది. భారత ప్రభుత్వం కల్పించిన అనేక రాయితీలకు ప్రతిఫలంగా మన ఎగుమతులపై ప్రతీకార సుంకాన్ని పాతిక శాతం నుంచి పది శాతానికి తగ్గించేందుకు అమెరికా అంగీకరించింది. అయితే ఫిబ్రవరి 20న అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఈ ఒప్పందం పునాది కూలిపోయింది. వాణిజ్య భాగస్వామ్య దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలు చెల్లవంటూ సుప్రీంకోర్టు ఆ రోజు తీర్పు చెప్పింది. ఆ తర్వాత కొన్ని గంటల వ్యవధిలోనే ట్రంప్ ప్రభుత్వం మరో ఆదేశాన్ని జారీ చేసింది. 1974 నాటి అమెరికా వాణిజ్య చట్టంలోని సెక్షన్ 122 ప్రకారం వాణిజ్య భాగస్వామ్య దేశాల నుంచి జరుగుతున్న దిగుమతులపై ఏకరీతిగా పది శాతం సుంకాన్ని విధిస్తున్నామని అందులో తెలిపింది. ఈ టారిఫ్ ఫిబ్రవరి 24 నుంచి అమలులోకి వచ్చింది. ఇది జూలై చివరి వారం వరకూ అమలులో ఉంటుంది.

విదేశీ మారక ద్రవ్యంపై మరింత ఒత్తిడి తప్పదు

బయటి నుంచి వస్తున్న ఒత్తిడులు,అలాగే రూపాయిపై పెరుగుతున్న ఒత్తిడి కారణంగా ఈ సమస్య మన దేశానికి చాలా సున్నితమైనదిగా మారింది. పెరుగుతున్న దిగుమతి వ్యయాలు, అధిక చమురు ధరలు, విదేశీ పెట్టుబడులు బయటికి పోవడం, నిరంతర చెల్లింపుల బ్యాలెన్స్ ఒత్తిడులు వంటి పరిణామాల కారణంగా గత 12 నెలల కాలంలో అమెరికా డాలరుతో పోలిస్తే మన రూపాయి తన విలువలో దాదాపు 12 శాతం కోల్పోయింది. ప్రతీకార సుంకాలను అమెరికా అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసిన తర్వాత భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం యొక్క ఆర్థిక తర్కమే కనుమరుగైంది. కాబట్టి ఐదు వందల బిలియన్ డాలర్ల విలువైన అమెరికా వస్తువుల కొనుగోలు ఒప్పందం అసంబద్ధం అవుతుంది. రుబియో చేసిన ట్వీట్‌పై భారత్ తన వైఖరిని స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. మన విదేశీ మారక ద్రవ్య పరిస్థితి ఇప్పటికే ఒత్తిడిలో ఉంది. ఈ తరుణంలో అమెరికా వస్తువుల కొనుగోలు వ్యవహారం మన దేశం నుంచి డాలర్ల తరలింపును గణనీయంగా పెంచుతుంది. అమెరికా నుంచి ఇంధనం, రక్షణ పరికరాలు, విమానాలు, వ్యవసాయోత్పత్తులను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటే మన వాణిజ్య లోటు మరింతగా పెరిగి రూపాయిపై ఒత్తిడిని పెంచుతుంది.

హేతుబద్ధత ఏది?పునరాలోచన అవసరం

రాబోయే సమస్యలను దృష్టిలో పెట్టుకొని నరేంద్ర మోడీ ప్రభుత్వం వాణిజ్య చర్చలపై పునరాలోచన జరపాల్సిన అవసరం ఉంది. ఫిబ్రవరి 20న అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ప్రతీకార సుంకాల విధానానికి గ్రహణం పట్టింది. ఫలితంగా వాణిజ్య ఒప్పందానికి ఆర్థిక సమర్థన కూడా కనుమరుగైంది

## అక్రమ వలసలకు చెక్

న్యూఢిల్లీ, మే 26: దేశంలోకి నానాటికీ పెరుగుతున్న అక్రమ వలసలకు చెక్ పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. అక్రమ వలసలు, చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాలతో దేశంలో జరుగుతున్న అసహజ జనాభా మార్పులపై అధ్యయనానికి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం ప్రకటించారు. ఈ సమస్య భారతదేశ సార్వభౌమత్వానికి, జాతీయ భద్రతకు, సామాజిక సమతుల్యతకు, గిరిజన సమాజాల పరిరక్షణకు పెనుసవాలుగా ఆయన అభివర్ణించారు. ఈ కమిటీ ఏర్పాటుకు సంబంధించి గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ వాగ్దానం చేశారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్ ప్రభాకర్ నవోలేకర్ అధ్యక్షత వహించే కమిటీలో మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి, జనగణన కమిషనర్ సభ్యులుగా ఉంటారని, హోంశాఖ సంయుక్త కార్యదర్శి (విదేశీయులు-1)సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారని 'ఎక్స్'లో చేసిన పోస్టులో షా పేర్కొన్నారు. అక్రమ వలసలు, సరిహద్దుల్లో చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాలతో దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న మార్పులతో పాటు మత, సామాజికవర్గాల వారీగా అసాధారణ జనాభా మార్పుల సరళిని ఈ కమిటీ సమగ్రంగా విశ్లేషిస్తుందని తెలిపారు. ఈ సమస్యలకు అర్థవంతమైన, విధానపరమైన, కాలపరిమితితో కూడిన పరిష్కారాలను ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందని అమిత్ షా తెలిపారు.

చైనా-పాక్ మధ్య జలాల సహకారం ప్రస్తావనను తోసిపుచ్చిన భారత్

చైనా, పాకిస్థాన్ దేశాలు విడుదల చేసిన ఉమ్మడి ప్రకటనలో జమ్మూకశ్మీర్‌పై చేసిన అనవసర ప్రస్తావనలను భారత్ తీవ్రంగా ఖండించింది. జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు భారత్‌లో ఎప్పటికీ అంతర్భాగాలేనని, ఈ విషయంలో వ్యాఖ్యానించే అధికారం ఏ ఇతర దేశానికీ లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూూ) అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇటీవల చైనాలో పర్యటించిన అనంతరం, మే 25న ఇరు దేశాలు ఒక ఉమ్మడి ప్రకటన చేశాయి. ఇందులో జమ్మూకశ్మీర్‌ను "చరిత్ర నుంచి మిగిలిపోయిన వివాదం"గా పేర్కొనడాన్ని భారత్ తప్పుబట్టింది. "జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు భారత్‌లో అంతర్భాగాలని, అవి ఎప్పటికీ భారత్‌లోనే ఉంటాయని మేము మరోసారి స్పష్టం చేస్తున్నాం. ఈ విషయంలో వ్యాఖ్యానించే అధికారం మరే దేశానికీ లేదు," అని రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (జూజుజ) ప్రాజెక్టులను కూడా భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. భారత సార్వభౌమాధికారానికి చెందిన భూభాగంలో పాకిస్థాన్ అక్రమ ఆక్రమణను చట్టబద్ధం చేసే ఏ ప్రయత్నాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామని జైస్వాల్ స్పష్టం చేశారు.ఇక చైనా, పాకిస్థాన్ మధ్య 'సరిహద్దు జలవనరుల సహకారం' అనే అంశాన్ని కూడా భారత్ తోసిపుచ్చింది. "ఆ రెండు దేశాల మధ్య ఉమ్మడి సరిహద్దు లేనప్పుడు, సరిహద్దు జలాల సహకారం అనే ప్రశ్నే తలెత్తదు," అని విదేశాంగ శాఖ తెలిపింది. అలాగే, పాకిస్థాన్.. షక్సగామ్ లోయను చైనాకు అప్పగించిన 1963 నాటి సరిహద్దు ఒప్పందాన్ని భారత్ ఎన్నడూ గుర్తించలేదని మరోసారి పునరుద్ఘాటించింది.

## మూగజీవలకు సైతం నీరు లేకుండా చేస్తున్న వైనం...



**పట్టించుకోని మత్యశాఖ ,ఇరిగేషన్ శాఖ అధికారులు..**

**బోనకల్ మే 26 ప్రజా వేదిక ప్రతినిధి**

బోనకల్ మండల పరిధిలో లక్ష్మీపురం గ్రామంలో చాపలు వేట కోసం చెరువులో నీళ్లు కరెంటు మోటర్లు సహాయంతో బయటకు పంపిస్తున్న వైనం చెరువులు సొసైటీ సభ్యులు నుండి తీసుకొని, కాంట్రాక్టర్లు చేస్తున్న నిర్వాహము, ఎండలు ఎక్కువగా వస్తున్న ఈ తరుణంలో మూగజీవాలకు సైతం నీరు లేకుండా చేస్తున్న కనీసం అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు ఎండాకాలం మూగజీవాలు మేతకు వెళ్లి నీరు తాగడానికి లేకుండా నీరంతా వృధా అవుతుంది కాబట్టి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వారు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వి.ఓ.ఏల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి



**బోనకల్ మే 26 ప్రజావేదిక ప్రతినిధి**

బోనకల్: ఐ.కె.పి వి.ఓ.ఏల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని చొప్పకట్లపాలెం ఉప సర్పంచ్ పల్లా కొండలరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జే.ఏ.సీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వి.ఓ.ఏలు సమ్మె బాట పట్టారు. రెండో రోజు మంగళవారం బోనకల్ తహశీల్దార్ కార్యాలయం ముందు వి.ఓ.ఏల సమ్మె శిబిరం వద్ద కూర్చుని వారికి మద్దతు ప్రకటించారు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కనీస వేతనం, అర్హులైన వారిని సి.సిలుగా పదోన్నతి కల్పించడం, సర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్.ఆర్ పాలసీ అమలు చేయడం, ఇరవై లక్షల ఆరోగ్య భీమా కల్పించడం, పని భారం తగ్గించుకోవడానికి ట్యాబ్ ఇచ్చి దానికి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడం, జి.ఓ 58 ను సవరించాలన్న వి.ఓ.ఏల డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కారం చేసి నిరవధిక సమ్మెను విరమింపజేయాలని కోరారు. మండుటెండలో మండలంలోని వివిధ గ్రామాల వి.ఓ.ఏలు ఐక్యంగా, పట్టుదలతో సమ్మె కొనసాగించడం అభినందనీయమని పల్లా కొండలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల వి.ఓ.ఎలు బోయినపల్లి దివ్య, విజయ, ఉష , మీరాబీ, ప్రమీల, రాజకుమారి, కృషచణవ్వా, ఫర్జానా, రమాదేవి, ప్రసునాంబ, ఖాసిం, నాగరాజు లు పాల్గొన్నారు.

## రఘునాథపాలెం సర్పంచ్ వ్యక్తిగత నిర్ణయాలతో విసుగుతున్న ప్రజలు



**రహస్యంగా గ్రామంలోని బందెలదొడ్డి స్థలం**
**గ్రామ సమైక్యల బిల్డింగ్ కేటాయింపు**
**గ్రామంలో పూర్వం నుండి బందెల దొడ్డి కొనసాగింపు**

**తిరుమలాయపాలెం మే 23**
**( ప్రజా వేదిక ) న్యూస్ ప్రతినిధి**

తిరుమలాయపాలెం మండల పరిధి లోని రఘునాథపాలెం గ్రామపంచాయతీలో సర్పంచ్ వ్యక్తిగత నిర్ణయాలతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అక్కడ ప్రజల ఆరోపిస్తున్నారు. డిసెంబర్ నెలల్లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన పాలకవర్గం సర్పంచి వ్యక్తిగత నిర్ణయాలతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీలో ఏ నిర్ణయం తీసుకోవాలన్న గ్రామ ప్రజలకు తెలియజేసి గ్రామ సభ నిర్వహించి గ్రామపంచాయతీలో నిర్ణయాలు తీసుకొని తీర్మానం చేసినా అనంతరం పనులు ప్రారంభించాలి. కానీ ఇటీవల రఘునాథపాలెం గ్రామపంచాయతీలో స్వయం సహాయక సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం గ్రామాలలో నూతన బిల్డింగులు నిర్మించాలని నిర్ణయం తీసుకోగా రఘునాథపాలెం గ్రామపంచాయతీలో పూర్వం నుండి రైతుల పంటలను కాపాడేందుకు పూర్వికులు బందెల దొడ్డి ని ఏర్పాటు చేసుకొని పంట పొలాల్లో విడిచిన గేదెలను ఆవులను బందెల దొడ్డిలో బంధించి సంబంధిత పంట మేసిన చేసిన రైతుకు నష్టపరిహారం కట్టించే విధంగా నిర్ణయాలు తీసుకునేవారు. అలాంటి బందెల దొడ్డి స్థలాన్ని గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామ ప్రజలకు తెలియకుండా గ్రామసభ నిర్వహించకుండా ఆ స్థలాన్ని స్వయం సహాయక సంఘాల సభ్యులకు బిల్లింగ్ నిర్మాణానికి కేటాయించి భూమి పూజ చేయడం ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని గ్రామంలో ప్రభుత్వ స్థలాలు ఉన్నచోట ఆ బిల్డింగ్ నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# పేదల జీవితాల్లో వెలుగులు నింపే వివోఏ ల జీవితాలు చీకట్లోనైనా...





**-మూతులకు నల్ల రిబ్బన్ కట్టుకొని మౌన దీక్ష చేస్తూ నిరసన తెలుపుతున్న వివోఏలు**
**వివోఏ ల దీక్షకు ఫోన్లో సంఘీభావం తెలిపిన పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి**
**బిఆర్ఎస్ మండల నాయకులు బిల్లగిరి ధనుంజయ్**

**తిరుమలాయపాలెం మే 26**
**( ప్రజా వేదిక )న్యూస్ ప్రతినిధి కూరపాటి ఉపేందర్**

ఫైనాన్స్ వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా పేద ప్రజలకు సరైన సమయంలో బ్యాంకు రుణాలు ఇప్పిస్తూ పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్న వివోఏల జీవితాలు మాత్రం చీకట్లో మగ్గుతున్నాయని వివోఏ లకు కనీస వేతనం 20000 రూపాయలు పెంచాలని బిఆర్ఎస్ మండల నాయకులు ధనుంజయ్ డిమాండ్ చేశారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలో మే 18వ తేదీ నుండి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చేస్తున్న సమ్మెలో భాగంగా రిలే నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఒప్పంద కార్మికులుగా పనిచేస్తున్న వివోఏలు అత్యంత దుర్భర జీవితం గడుపుతున్నారని ప్రభుత్వం అమలు చేసే ఏ సంక్షేమ ఫలాలు ప్రజలకు అందాల అన్న వివోఏల పాత్ర ముఖ్యంగా ఉందని ప్రభుత్వ ప్రతి పనిలో వివోఏలను భాగస్వాములు చేస్తూ వారికి కనీస వేతనం ఇవ్వకుండా వెట్టిచాకరీ చేయించుకుంటుందని ఆయన విమర్శించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వివో ఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారికి కనీస వేతనం 20000 రూపాయలు పెంచి నేరుగా వారి వ్యక్తిగత కాదాల్లో వేతనం జమ చేయాలని 57 ఏళ్లు దాటిన వివోఏ లకు పెన్షన్లు ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని బీమా ఇన్సూరెన్స్ సౌకర్యం ఇవ్వాలని వివోఏ లకు వారి కుటుంబాలకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వివోఏ ల సమ్మెకు బిఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ మద్దతు ఇస్తుందని ఆయన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి ఫోన్లో వివోఏలకు సంఘీభావం తెలిపారు వెంటనే వారి సమస్యలను పరిష్కరించి వేతనాలను పెంచాలని ఆయన కోరారు. స్థానిక మంత్రులు వెంటనే స్పందించి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించే విధంగా చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు బిల్లగిరి ధనుంజయ్, రెడ్డి మల్ల నరేందర్, పగిడిపల్లి బాబు, బిల్లగిరి వెంకటేశ్వర్లు, తొర్రికొండ వెంకటనారాయణ, గంటా కృష్ణ, గుగ్గిళ్ళ అశోక్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు కమ్మ కోమటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, సిఐటియు మండల కార్యదర్శి వశపొంగు వీరన్న ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చింతిరాల నాగభూషణం గుగ్గిళ్ళ అశోక్ వివోఏల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల,గుగ్గిళ్ళ ఉమా, మందాది కళమ్మ, పోలూరి విజయలక్ష్మి బొడ్డు కుసుమ,మాధురి, మేకల కృష్ణవేణి, ధనలక్ష్మి, మెట్టు స్వరూప రాణి, గుంతెటి విజయ కుమారి, కవిత, కుమారి, రమణ, పద్మ సామినేని కరుణ, సుజాత, మంజుల, జయ, గోపోజి ఉపేంద్ర, విజయలక్ష్మి,సిహెచ్ జ్యోతి, షేక్ జానీ, బేగం, సువర్ణ, ఉష, ఇందిరా, రాంబాయి సుజాత, మంజుల, శ్రావణి, స్రవంతి ధనలక్ష్మి, జయ, తదితరులు పాల్గొన్నారు.

# సంకరబోయిన వీరన్న కుటుంబాన్ని పరామర్శించిన -జిల్లా కాంగ్రెస్ నాయకులు మందడి ఇజ్రాయిల్

**తిరుమలాయపాలెం మే 26 ( ప్రజా వేదిక ) న్యూస్ ప్రతినిధి కూరపాటిఉపేందర్**

తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్ గ్రామంలో అకాల మరణం తో కన్నుమూసిన కాంగ్రెస్ అభిమాని సంకరబోయిన వీరన్న కుటుంబాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకులు మందడి ఇజ్రాయిల్ పరామర్శించారు. వీరన్న నివాసానికి వెళ్లిన ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముఖ్యంగా వీరన్న భార్యను ధైర్యం చెప్పి, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మందడి ఇజ్రాయిల్ మాట్లాడుతూ,

"వీరన్న మరణం వ్యక్తిగతంగా నాకు తీరని లోటు. చిన్ననాటి నుంచి ఎంతో ఆప్యాయతతో కలిసిమెలిసి పెరిగిన మంచి మిత్రుడిని కోల్పోయాను" అని భావోద్వేగానికి గురయ్యారు."కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలపై వీరన్నకు అపారమైన మక్కువ ఉండేది. పార్టీ కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండి పనిచేసేవాడు. నాయకుల కంటే కార్యకర్తలే పార్టీకి బలం అని నమ్మిన నిజమైన కాంగ్రెస్ సైనికుడు వీరన్న" అని



కొనియాడారు.అలాగే," మనిషి వెళ్లిపోయినా ఆయన మంచితనం, సేవాభావం, స్నేహం ఎప్పటికీ గుర్తుండి పోతాయి. వీరన్న లాంటి వ్యక్తులు సమాజానికి ఆదర్శం" అని పేర్కొన్నారు. వీరన్న కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, వారి కుటుంబానికి తాము ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ప్రెసిడెంట్ బండారు సత్తిరెడ్డి, మోటపోతుల శ్రీనివాస్, అన్న బత్తుల సత్తిబాబు కాంగ్రెస్ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించాలి.

**బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,మే 26.**

మోడీ ప్రభుత్వం పది రోజుల్లో మూడవసారి పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి ప్రజల నడ్డి విరిచిందని, పెట్రోల్ పై లీటరుకు 2.61 రూపాయలు, డీజిల్ పై 2.71 రూపాయలు పెంచడంతో గత పది రోజుల్లో లీటర్ పెట్రోల్ రూ 7.38 పెట్రోల్, డీజిల్ రూ. 7.49 పైసలు పెంచడం దారుణమని జగ్గుతండా ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి అన్నారు.నేటి ఉదయం పెట్రోల్ పోసుకోవడానికి వెళ్తే 115 రూపాయల 83 పైసలని బంకులో అన్నారని చెప్పారు.ఒకవైపు ప్రధానమంత్రి మోడీ మ ప్రజలకు పొదుపు చేయాలని చెప్పి ఆయన మాత్రం పెట్రోల్ డీజిల్ ధరలను పెంచడం ఏమిటని ప్రశ్నించారు.పెంచిన ధరలను ఉపసంహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని



గుంజ వీరస్వామి డిమాండ్ చేశారు.చమురు

సంస్థల ఒత్తిడితో పెట్రోల్, డీజిల్ ధరలను కనీసం లీటరుకు రూ.15 వరకు పెంచడానికి కేంద్రం సిద్ధమైనట్లు వస్తున్న వార్తలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు.చమురు కొరత లేదని, ధరలు పెరగవని ఎన్నికల ముందు చెప్పిన కేంద్రం నేడు వరుసగా పెంచడం ప్రజలను మోసగించడమేనని విమర్శించారు. ఒక్కసారిగా భారీగా పెంచితే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని దశల వారిగా పెంచడం వంచించడమేనని పేర్కొన్నారు. ఇంధన ధరల పెరుగుదలతో రవాణా ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరలతో పాటు అన్ని రకాల సరుకుల ధరలు మరింత పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించాలని వీరస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## గ్రామ స్వయం సహాయక సంఘ భవనాలకు శంకుస్థాపన చేసిన సర్పంచ్లు...



**బోనకల్ మే 25 మే ప్రజావేదిక ప్రతినిధి.**

ఇందిరా క్రాంతి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత చేర్చటం కొరకు స్వయం సహాయక సంఘాల భవనాలకు బోనకల్ మండలంలోని బోనకల్ ,చిరునోముల, రావినూతల, జానకిపురం, పెద్ద బీరవల్లి,చిన్న బీరవల్లి ,రాపల్లి , బ్రాహ్మణపల్లి, కలకోట,లక్ష్మీపురం గ్రామాల్లో సర్పంచ్ లు సీసీల ఆధ్వర్యంలో శంకుస్థాపనలు జరిగాయి. ప్రతి గ్రామంలో స్వయం సహాయక సంఘ భవన నిర్మాణం చేపట్టాలనే దృఢ సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు ఆయా పంచాయతీలలో గ్రామ సంఘ భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయాలని తెలంగాణ రాష్ట్ర,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు గ్రామంలో పండుగ వాతావరణంలో శంకుస్థాపన చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎపిఎం వెంకటేశ్వర్లు సర్పంచులు మెంబర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తీవ్ర ఎండలు,వడగాలుల నేపథ్యంలో సామాన్య ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.



**-బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్ రావు.**

**బయ్యారం,ప్రజా వేదిక న్యూస్,మే 26.**

మండలంలో తీవ్ర ఎండలు, వడగాలులు కొనసాగుతున్న నేపథ్యంలో సామాన్య ప్రజలు,ఉపాధి హామీ కూలీలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్ రావు అన్నారు.మండలంలో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు అవుతున్నందున,ముఖ్యంగా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు.వృద్ధులు,చిన్నపిల్లలు, గర్భిణీలు,అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తుమ్మల శ్రీనివాస్ రావు తెలిపారు.ఎండ తీవ్రత వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం అధికంగా ఉండడంతో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రజలు తరచుగా నీరు,మజ్జిగ, కొబ్బరి నీరు,నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని,పుచ్చకాయ, దోసకాయ వంటి నీటి శాతం అధికంగా ఉండే పండ్లను తీసుకోవాలని తెలిపారు.బయటకు వెళ్లే సమయంలో గొడుగు,టోపీ వంటివి వడదెబ్బ తగలకుండా ఉపయోగించాలని అన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావొద్దని సూచించారు.వడదెబ్బ లక్షణాలైన అధిక జ్వరం, తలనొప్పి, తల తిరగడం, వాంతులు, అలసట,చెమట ఆగిపోవడం, స్పృహ కోల్పోవడం వంటి సమస్యలు కనిపిస్తే వెంటనే బాధితులను చల్లని ప్రదేశానికి తరలించలన్నారు.ప్రజలు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తుమ్మల శ్రీనివాస్ రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## బర్తడే వేడుకల్లో పాల్గొన్న గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు.

**చింతకాని మే 26 ప్రజా వేదిక ప్రతినిధి: వీరబాబు.**



చింతకాని మండల పరిధిలో తిరుమలాపురం గ్రామానికి చెందిన బండి గోపినాథ్ - వర్షకుమారి దంపతులు కుమారుడు యోగేశ్వరరావు బర్డే వేడుకలు వారి ఇంటి ఆవరణంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా యోగేశ్వరరావు కు బర్త్ డే విషెస్ చెప్పి కేక్ కట్ చేసి,అక్షింతలేసి ఆశీర్వదించారు.గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావడంతో పాటు, గ్రామస్తుల వ్యక్తిగత వేడుకల్లో సర్పంచ్ పాల్గొనడం గ్రామ ప్రజల మధ్య బంధాన్ని బలోపేతం చేస్తుంది. ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, గోగుల నరసింహారావు, బండి రామారావు. బండి సైదులు. గోగుల ప్రసాద్, బండి యాకోబు, బంధువులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వి.ఓ.ఏల న్యాయమైన. కోరికలను వెంటనే పరిష్కరించాలి

**నేలకొండపల్లి మే 26 ప్రజావేదిక న్యూస్**




నేలకొండపల్లి: ఐ.కె.పి వి.ఓ.ఏల న్యాయమైన కోరికలను వెంటనే పరిష్కారం చేయాలని మంగళవారం నేలకొండపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జే.ఏ.సీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వి.ఓ.ఏలు సమ్మె బాట పట్టారు. 5వ రోజు మంగళవారం నేలకొండపల్లి పొట్టి శ్రీరాములు సెంటర్ నందు ఏర్పాటుచేసిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి . ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా 3000 అరకొర జీతానికి గ్రామంలోని అన్ని రకాల సేవలను ప్రజలకు అందిస్తున్న, వి.ఓ.ఏల.ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇకనైనా గుర్తించి వారికి కనీస 20 వేల వేతనం అందించాలని. సర్పంచ్ డిమాండ్ చేశారు.సమ్మె శిబిరం వద్ద సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, కూర్చుని వారికి మద్దతు ప్రకటించారు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కనీస వేతనం, అర్హులైన వారిని సి.సిలుగా పదోన్నతి కల్పించడం, సేర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్.ఆర్ పాలసీ అమలు చేయడం, ఇరవై లక్షల ఆరోగ్య భీమా కల్పించడం, పని భారం తగ్గించుకోవడానికి ట్యాబ్ ఇచ్చి దానికి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడం, జి.ఓ 58 ను సవరించాలన్న వి.ఓ.ఏల డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కారం చేసి నిరవధిక సమ్మెను విరమింపజేయాలని కోరారు. మండుటెండలో మండలంలోని వివిధ గ్రామాల వి.ఓ.ఏలు ఐక్యంగా, పట్టుదలతో సమ్మె కొనసాగించడం అభినందనీయమని కొలువు రాజకీయ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల వి.ఓ.ఎలు సిపిఎం బిఆర్ఎస్ నాయకులు నిరసన శిబిరం సందర్శించి వారికి సంఘీభావం తెలియజేశారు.

## హైదరాబాద్‌కు వచ్చేసిన బెంగళూరు ఫేమస్ 'ఊట'.. తెలుగు రుచులకు కొత్త అడ్డా

హైదరాబాద్ హైటెక్ సిటీలో ప్రారంభమైన 'ఊట' రెస్టారెంట్
బెంగళూరులో ప్రసిద్ధి చెందిన బ్రాండ్ ఇది
తెలంగాణ, ఆంధ్రా, నిజామీ వంటకాలే ఇక్కడ ప్రత్యేకం
పూతరేకులు, బందరు హల్వా వంటి సంప్రదాయ రుచులు
టోటల్ ఎన్విరాన్‌మెంట్ హాస్పిటాలిటీ ఆధ్వర్యంలో నిర్వహణ




బెంగళూరులో ప్రాంతీయ వంటకాలకు పేరుగాంచిన 'ఊట' రెస్టారెంట్ ఇప్పుడు హైదరాబాద్ నగర వాసులకు అందుబాటులోకి వచ్చింది. నగరంలోని హైటెక్ సిటీ (మాదాపూర్)లో తమ కొత్త బ్రాంచ్‌ను ప్రారంభించింది. అచ్చమైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, నైజాం వంటకాలను అందించడమే ఈ రెస్టారెంట్ ప్రత్యేకత.

టోటల్ ఎన్విరాన్‌మెంట్ హాస్పిటాలిటీ ఈ రెస్టారెంట్‌ను నిర్వహిస్తోంది. ఇక్కడి మెనూలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రసిద్ధ వంటకాలకు పెద్దపీట వేశారు. స్టార్టర్స్‌లో శికంపూరి కబాబ్స్, నెల్లూరు చేపల వేపుడు, బాపట్ల కోడి వేపుడు వంటివి అందిస్తుండగా, ప్రధాన వంటకాల్లో హలీమ్-ఎ-ఖాస్, ముద్దపప్పుతో పచ్చి పులుసు, నాటు కోడి పులుసు, పీతల ఇగురు వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.వీటితో పాటు డెజర్ట్స్‌లో ఆత్రేయపురం పూతరేకులు, మచిలీపట్నం బందరు హల్వా వంటి సంప్రదాయ రుచులను కూడా అందిస్తున్నారు. అంతేకాకుండా, గుంటూరు ఓల్డ్ ఫ్యాషన్డ్, గోంగూర హైబాల్ వంటి వినూత్న కాక్‌టెయిల్స్ కూడా మెనూలో ఉన్నాయి. కర్ణాటకలో విజయం సాధించిన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆహార సంస్కృతులను పరిచయం చేయాలనుకోవడం సహజమైన ముందడుగు అని టోటల్ ఎన్విరాన్‌మెంట్ వ్యవస్థాపకుడు కమల్ సాగర్ పేర్కొన్నారు.ప్రస్తుతం సోషల్ మీడియా, ఫుడ్ ప్లాట్‌ఫామ్స్‌లో ఈ రెస్టారెంట్ గురించి మంచి చర్చ జరుగుతోంది. హైదరాబాద్‌లో సంప్రదాయ తెలుగు, నైజాం వంటకాలను ఆధునిక వాతావరణంలో ఆస్వాదించాలనుకునే వారికి ఇది ఒక మంచి ఎంపికగా నిలుస్తోంది.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్: భారీ ప్లాన్ తో రంగంలోకి బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్!

కొంపల్లిలో భారీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ చేపట్టనున్న బ్రిగేడ్
5.6 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్న ప్రీమియం వెంచర్
ఈ ప్రాజెక్టు ద్వారా రూ.850 కోట్ల ఆదాయం అంచనా
హైదరాబాద్‌లో విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఈ ఒప్పందం




రాబోయే 3-4 ఏళ్లలో రూ.5,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్న సంస్థ

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. నగరంలోని కొంపల్లి ప్రాంతంలో 5.6 ఎకరాల స్థలంలో ఒక ప్రీమియం రెసిడెన్షియల్ హౌసింగ్ ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కుదుర్చుకున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.850 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తోంది.

ఈ ఒప్పందం కింద, భూ యజమానితో కలిసి బ్రిగేడ్ ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనుంది. అయితే, భూ యజమాని వివరాలను కంపెనీ వెల్లడించలేదు. బెంగళూరు కేంద్రంగా పనిచేసే ఈ సంస్థ, హైదరాబాద్‌ను తమ వృద్ధికి కీలకమైన మార్కెట్‌గా పరిగణిస్తోంది. భవిష్యత్తులో కూడా నగరంలో మరిన్ని భూములను కొనుగోలు చేసి, కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రణాళికలు రచిస్తోంది.రాబోయే 3-4 సంవత్సరాలలో దేశవ్యాప్తంగా రెసిడెన్షియల్, కమర్షియల్, హాస్పిటాలిటీ, రిటైల్ ప్రాజెక్టులలో సుమారు రూ.5,000 కోట్లు పెట్టుబడి పెట్టాలని బ్రిగేడ్ గ్రూప్ లక్ష్యంగా పెట్టుకుంది. 1986లో స్థాపించిన ఈ సంస్థ బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, మైసూర్‌తో పాటు పలు ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ, విద్యారంగాల్లో తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది.

# సూర్యాపేటలో వరుస హత్యలు...

# పోలీసులు అప్రమత్తం, సమాజం ఆలోచించాల్సిన సమయం






**-మొన్న ఆస్తి... నిన్న పగ... నేడు ఆవేశం...**
**ఇలా చిన్న చిన్న విషయాలకే ప్రాణాలు తీసుకుంటున్న తీరు...**

ప్రజా వేదిక న్యూస్,మే 26.

తెలంగాణలోని సూర్యాపేట జిల్లా గత కొద్ది రోజులుగా వరుస హత్యల ఘటనలతో వార్తల్లో నిలుస్తోంది. కుటుంబ కలహాలు, వ్యక్తిగత వైరం, ప్రేమ వ్యవహారాలు, చిన్న చిన్న గొడవలు... కారణం ఏదైనా చివరికి ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతోంది. ప్రతి ఘటన ప్రజల్లో భయాన్ని, ఆందోళనను పెంచుతోంది. అయితే మరోవైపు జిల్లా పోలీసు యంత్రాంగం స్పందిస్తున్న తీరు మాత్రం ప్రజల్లో కొంత భరోసా కల్పిస్తోంది.

ఘటన జరిగిన వెంటనే నిందితులను గుర్తించడం, సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో వేగంగా విచారణ పూర్తి చేయడం, నిందితులను అరెస్ట్ చేయడం వంటి చర్యల్లో పోలీసులు చూపుతున్న చురుకుదనం అభినందనీయం. చాలా సందర్భాల్లో ఘటన జరిగిన గంటల వ్యవధిలోనే నిందితులను పట్టుకోవడం ద్వారా పోలీసులు తమ పనితీరును నిరూపిస్తున్నారు. నేరం చేసిన వ్యక్తి ఎంత తెలివిగా తప్పించుకోవాలని చూసినా చట్టం ముందు నిలబడాల్సిందే అనే సందేశాన్ని పోలీస్ శాఖ బలంగా ఇస్తోంది.

**కేవలం కేసులు ఛేదించడం మాత్రమే కాదు...**

“నేరం జరగకముందే ఆపాలి” అనే లక్ష్యంతో పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం మరింత ప్రశంసనీయం. గ్రామాల్లో శాంతి సమావేశాలు, యువతకు కౌన్సిలింగ్, విద్యార్థులకు చట్టాలపై అవగాహన, సోషల్ మీడియా ద్వారా హెచ్చరికలు, కుటుంబ సమస్యలను చర్చించుకునే విధంగా ప్రజలకు సూచనలు... ఇలా అనేక రూపాల్లో పోలీసులు సమాజాన్ని చైతన్యపరచడానికి ప్రయత్నిస్తున్నారు.

అయితే ఇక్కడే ఒక పెద్ద ప్రశ్న సమాజం ముందుకు వస్తోంది...
ఇంత అవగాహన కల్పిస్తున్నా...
హత్యలు ఎందుకు ఆగడం లేదు?

పోలీసులు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. నేరస్థులను వెంటనే పట్టుకుంటున్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కార్యక్రమాలు చేస్తున్నారు. అయినా ఎందుకు కొందరు క్షణిక కోపంలో ప్రాణాలు తీసే స్థాయికి వెళ్తున్నారు?

ఇది కేవలం పోలీసుల సమస్యేనా...? లేదా సమాజం మొత్తం ఎదుర్కొంటున్న మానసిక సంక్షోభమా...?

ఈరోజు చాలామంది చిన్న గొడవనైనా ఓర్పుతో పరిష్కరించుకోవడం మానేస్తున్నారు. కోపం వచ్చిన క్షణంలోనే హింసాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఒకప్పుడు కుటుంబ పెద్దలు, బంధువులు, గ్రామ పెద్దలు కూర్చోబెట్టి సమస్యలు పరిష్కరించేవారు. ఇప్పుడు మాటల కంటే ఈగో, కోపం, సోషల్ మీడియా ప్రభావం ఎక్కువవుతున్నాయి.

యువతలో పెరుగుతున్న అసహనం ప్రమాదకరం

ప్రస్తుతం యువతలో సహనం తగ్గిపోతుందనే అభిప్రాయం అనేక ఘటనల ద్వారా కనిపిస్తోంది. సోషల్ మీడియాలో చూసే హింసాత్మక కంటెంట్, సినిమాల ప్రభావం, మద్యం, డ్రగ్స్ వంటి అంశాలు కొందరిలో మానసిక అస్థిరతకు దారితీస్తున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.



ఒక చిన్న గొడవ...
ఆస్థి కోసం ...
పగలు ప్రతికారాలు...
క్షనిక ఆవేశం...
ఇలాంటి కారణాలకే ప్రాణాలు తీసే పరిస్థితి రావడం
సమాజానికి మంచిది కాదు.

పోలీసులు ఒంటరిగా ఎంతవరకు పోరాడగలరు?

ఇక్కడ ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన విషయం ఇదే. పోలీసులు తమ బాధ్యత నిర్వర్తిస్తున్నారు. నేరం జరిగిన తర్వాత నిందితులను పట్టుకుంటున్నారు. అవగాహన కార్యక్రమాలు చేస్తున్నారు. కానీ ప్రతి ఇంట్లో, ప్రతి మనసులో ఏమి జరుగుతుందో పోలీసులకు ఎలా తెలుస్తుంది?

అందుకే సమాజం కూడా బాధ్యత తీసుకోవాలి.తల్లిదండ్రులు పిల్లల మానసిక పరిస్థితిని గమనించాలి.
పాఠశాలలు, కళాశాలల్లో కౌన్సిలింగ్ వ్యవస్థ బలోపేతం కావాలి.
యువతకు కోప నియంత్రణ, చట్టాలపై అవగాహన కల్పించాలి.
గ్రామాల్లో సామాజిక చర్చలు పెరగాలి.
సోషల్ మీడియా వేదికగా ద్వేషాన్ని కాకుండా అవగాహనను పెంచాలి.

“అరెస్ట్” కంటే “అవగాహన” గొప్పది నిందితులను పట్టుకోవడం పోలీసుల విధి. కానీ ఒక నేరం జరగకముందే ఆపగలిగితే అదే అసలైన విజయం.

ప్రస్తుతం సూర్యాపేట పోలీసులు చేస్తున్న అవగాహన కార్యక్రమాలు అదే దిశగా కనిపిస్తున్నాయి. అయితే ఈ ప్రయత్నాలకు ప్రజల సహకారం కూడా తప్పనిసరి.

ప్రతి కుటుంబం ఒక చిన్న మార్పు తీసుకొస్తే...
ప్రతి యువకుడు కోపం కంటే ఓర్పు ఎంచుకుంటే...
ప్రతి గ్రామం సమస్యలను చర్చతో పరిష్కరించుకుంటే...
ఇలాంటి ఘటనలు చాలా వరకు తగ్గే అవకాశం ఉంటుంది.సూర్యాపేట జిల్లాలో వరుస హత్యలు ఆందోళన కలిగిస్తున్నప్పటికీ, పోలీసులు చూపుతున్న అప్రమత్తత, వేగవంతమైన చర్యలు, అవగాహన కార్యక్రమాలు ప్రశంసనీయం. అయితే నేరాలు పూర్తిగా తగ్గాలంటే కేవలం పోలీసులపై ఆధారపడకుండా సమాజం మొత్తం మారాల్సిన అవసరం ఉంది.

“పోలీసులు కష్టపడుతున్నారు... కానీ సమాజం కూడా మారడానికి సిద్ధంగా ఉందా?”
అనే ప్రశ్నకు
ప్రతి ఒక్కరూ తమ మనసులో సమాధానం వెతకాల్సిన సమయం ఇదే..